


# కరపత్రం

SINCE 2014

శనివారం ఏప్రిల్ 4, 2026 | సంపుటి : 2 | సంచిక : 173 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## టెక్స్‌టైల్‌రంగంలో తెలంగాణ అగ్రగామి

» ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సహిస్తాం
» చేనేత, ముత్యాలకు పెట్టింది పేరు తెలంగాణ
» ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్

**హైదరాబాద్,ఏప్రిల్3 :**
తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం. పర్యావరణ పరిరక్షణెళి మా తొలి ప్రాధాన్యం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన టెక్స్‌టైల్ రంగ ప్రముఖులకు స్వాగతం పలుకుతూ, తెలంగాణను ప్రపంచ వస్త్ర రంగ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రభుత్వ దార్శనికతను పంచుకున్నారు.తెలంగాణకు వస్త్ర రంగంతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని గుర్తుచేశారు.



భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర ఉంది. తెలంగాణ గర్వంగా చెబుతోంది.. టెక్స్‌టైల్ మన డిఎన్ఎలోనే ఉంది. నిజాం కాలంలోనే ప్రపంచ నలుమూలల నుండి వ్యాపారులు హైదరాబాద్ కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారు అని ఆయన పేర్కొన్నారు. కేవలం పరిశ్రమగానే కాకుండా, ఇది లక్షలాది మందికి జీవనాధారమని.. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్ వంటివి మన సంస్కృతికి ప్రతీకలని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047' గురించి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వివరిస్తూ, 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను సీఎం ప్రకటించారు.

2లో..



## బిఆర్ఎస్‌లో ఇంటి గొడవలు

▪ బిజెపిలో రాముడి రాజకీయం
▪ ఈ రెండు పార్టీలకు తెలంగాణలో కాలం చెల్లింది
▪ ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే వందసీట్లు సాధిస్తాం
▪ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్

**మంచిర్యాల,ఏప్రిల్3 :**
తెలంగాణ రాజకీయాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోయిందని, బీజేపీకి రాష్ట్రంలో స్థానం లేదని ఆయన అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో కాంగ్రెస్ నేతలతో భేటీ అయిన ఆయన.. ఈ మేరకు ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని రకాల కుట్రలు పన్నినా.. కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉంది. అందుకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో కొంత కాలంగా అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. కేసీఆర్ కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కవిత వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందన్నారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై.. కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఆయన అసెంబ్లీకి కూడా రావడం లేదు. ఇలాంటి పరిస్థితిలో బిఆర్ఎస్ రోజురోజుకు దిగజారుతోందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ.. దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడుగుతోంది. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు.. అందుకే ఆ పార్టీని దూరం పెడుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది.

మిగతాది 2లో



## రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

▪ సభలో మాట్లాడే అవకాశం ఇవ్వరాదని లేఖ
▪ ఆప్ తీరుపై మండిపడ్డ రాఘవ్ చద్దా
▪ ప్రజా సమస్యలపై గొంతెత్తితే తట్టుకోలేరా?
▪ వీడియో విడుదల చేసిన రాఘవ్ చద్దా

**న్యూఢిల్లీ,ఏప్రిల్3 :**

2లో



## ట్రాన్స్‌జెండర్లకు గుడ్ న్యూస్ డ్రోన్ పైలట్ శిక్షణ

**హైదరాబాద్ :**
తెలంగాణ ప్రభుత్వానికి చెందిన 'దివ్యాంగులు, వృద్ధులు ,ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ', ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల కోసం నైపుణ్య శిక్షణా కార్యక్రమాల ప్రారంభోత్సవాన్ని నిర్వహించనుంది.



2లో..

## తెలంగాణలో రానున్న 3 రోజుల పాటు వర్షాలు

**హైదరాబాద్:**
తెలంగాణలో రానున్న 3 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## తెలంగాణలో ఏం చేశారని.. కేరళలో రేవంత్ ప్రచారం: కిషన్‌రెడ్డి

**హైదరాబాద్:**
కేరళ ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి భాజపాపై తప్పుడు ఆరోపణలు చేశారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు.



2లో

## స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

## ఆనాడు మాట్లాడిని రేవంత్ ఇప్పుడు మాట్లాడడం లేదు

▪ టిఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది..ఎవరైనా వాడుకోవచ్చు
▪ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఏప్రిల్3 :**
రాష్ట్రంలో స్కూల్ ఫీజుల గొడవ నడుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 39,640 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. సీబీఎస్సీ సెంట్రల్ సిలబస్ ఉన్న స్కూల్స్‌లో 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచి ఇప్పటినుంచే వసూలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడారని గుర్తుచేశారు. ఎవరెంత తిన్నారంటూ అసెంబ్లీలో చర్చ చేసుకున్నారే తప్ప ఫీజుల నియంత్రణపై మాట్లాడలేదని విమర్శించారు.



## కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్త

▪ కార్బైడ్ మామిడి పల్లను గుర్తించండి: సజ్జన్నార్



2లో..

**హైదరాబాద్,ఏప్రిల్3**
ఓన్ ప్రారంభం అయ్యింది. నగరంలో నోరూరించే పళ్లు కనిపిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు వ్యక్తులు కల్తీ మామిడి విక్రయాలకు పాల్పడటం ఆందోళనకు గురిచేసే విషయం. మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్ రసాయనాలతో కృత్రిమంగా పండించి విక్రయిస్తున్న వ్యాపారుల పట్ల జాగ్రత్త అవసరం. ఈ కల్తీ పండ్ల వల్ల ఆరోగ్య సమస్యలు రావడమే కాకుండా క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ విషయమై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ.సజ్జానార్ ఎక్స్ వేదికగా స్పందించారు. వేసవి కాలం రాకతో మామిడి మార్కెట్‌లో సందడి చేస్తోందని సజ్జనార్ అన్నారు.



2లో..

## కాంగ్రెస్‌పై రెండేళ్లలోనే ప్రజల్లో వ్యతిరేకత

.రేవంత్ రెడ్డి దిగిపోవాలని కోరుకుంటున్నారు
.మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**జగిత్యాల,ఏప్రిల్3 :**
కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ రానున్న రోజుల్లో ఊహించలేని పరిస్థితి ఎదుర్కొంటుందని కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జోస్యం చెప్పారు. తాను ఏ పార్టీలో చేరాలనేది కార్యకర్తల కోరిక మేరకే ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనకు విసుగొచ్చిన రాష్ట్ర ప్రజలు మార్పు రావాలి..



2లో..

## గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

## తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చాం

» ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం
» బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

**నారాయణపేట,ఏప్రిల్3 :**
గిరిజనులకు ఉన్న 6 శాతం రిజర్వేషన్‌ని 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనతా ఆయనకే దక్కుతుందన్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం బావోజీ జాతరకు మాజీ మంత్రులు హరీశ్ రావు, శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..'లోక్ మసంద్ మహారాజ్ జాతరకు రావడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతానికి రూ.8 కోట్లతో బ్రిడ్జి వేయించింది మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి.

## సాండ్ మాఫియా చేతుల్లోకి ఇసుక ఆదాయం

» నిజాలు బయటపెట్టి లెక్కలు చెప్పాలి
» బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్

**హైదరాబాద్,ఏప్రిల్3 :**
తెలంగాణ రాష్ట్రంలో ఇసుక తవ్వకాల ఆదాయంపై కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేస్తున్న గణాంకాలు పూర్తిగా తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్ విమర్శించారు.



మిగతాది 2లో

## రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

మొదటిపేజీ తరువాయి
రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చద్దాను ఆ పదవి నుంచి ఆప్ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా తాజాగా స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని బహిరంగంగా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో గానీ.. తనను ఓడించలేరంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా.. ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా అని నిలదీశారు. నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టుల్లో ఆహార ధరలు, గిగ్ వర్కర్ల సమస్యలు, టోల్ ప్లాజా దోపిడీ, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే.. అది ఆమ్‌ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా అని అన్నారు. మొన్నటికి మొన్న వివిధ రకాల పన్నులుపై నిలదీశారు. దీనివల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయగలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తా. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకుపడతా అని రాఘవ్ చద్దా తన వీడియోలో పేర్కొన్నారు. రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా రాఘవ్ చద్దాను తొలగించిన ఆప్.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించింది. ఆప్ నిర్వహిస్తున్న కార్యకలాపాలకు చద్దా దూరంగా ఉంటుండటం, పార్టీ కార్యక్రమాలపై స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాఘవ్ చద్దా భాజపాలో చేరనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశ మైంది.ఎంపి రాఘవ చద్దాని ఉపనాయకుడి పదవి నుంచి తొలగించాలని గురువారం రాజ్యసభ సచివాలయానికి ఆ పార్టీ లేఖ రాసింది. సభలో రాఘవ చద్దాని మాట్లాడనివ్వకూడదని కూడా ఆ లేఖలో ఆప్ పేర్కొంది. దీనిపై ఆప్ ఎంపి రాఘవ్‌చద్దా శుక్రవారం స్పందించారు. పార్లమెంటులో ప్రజా సమస్యలను లేవనెత్తడం నేరమా? నేను ఏదైనా తప్పు చేశానా? అని ఆప్‌ని ప్రశ్నించారు. ఈ మేరకు ఓ వీడియోను ఆయన శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. నాకు ప్రజల మద్దతు ఉంది. నా మౌనాన్ని నా ఓటమిగా పొరపాటు పడకండి అని రాఘవ్ చద్దా వీడియోలో తెలిపారు.

## ట్రాన్స్‌జెండర్లకు గుడ్ న్యూస్

మొదటిపేజీ తరువాయి
ఈ శిక్షణా కార్యక్రమాలలో డ్రోన్ పైలట్ శిక్షణ, హోటల్ నిర్వహణ విభాగం కింద క్యాంటీన్ చెఫ్ శిక్షణ , కారు డ్రైవింగ్ నైపుణ్య శిక్షణను అందిస్తారు. ఈ కార్యక్రమం రేపు (04.04.2026) ఉదయం 11:00 గంటలకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న NITHM ప్రాంగణంలో జరగనుంది. ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖల గౌరవ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

## తెలంగాణలో రానున్న 3 రోజుల పాటు వర్షాలు

మొదటిపేజీ తరువాయి
శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడే అవకాశముంది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్ల?ల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

## స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

మొదటిపేజీ తరువాయి
ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తేవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులను పెంచుతున్నాయే తప్ప టీచర్లకు మాత్రం జీతాలు పెంచరని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఆహార నాణ్యతను ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలు, ఆసుపత్రులను సీఎం ప్రారంభిస్తున్నారని... వాళ్ళ దోపిడిని ఎంకరేజ్ చేస్తున్నారా అంటూ నిలదీశారు. ప్రైవేట్ స్కూల్స్ దోపిడీని కంట్రోల్ చేయాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే స్కూల్స్ ముందు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. 'అన్ని శాఖలకు ముఖ్యమంత్రే మంత్రిగా ఉండటం మన కర్మ' అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో తనను నిజామాబాద్‌కు పరిమితం చేశారని అన్నారు. ఆంధ్రా, నార్త్ ఇండియా వాళ్ళు ఇక్కడ విద్యా సంస్థలు నెలకొల్పినా తెలంగాణ వాళ్ళకే అవకాశం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని.. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు.

## సాండ్ మాఫియా చేతుల్లోకి ఇసుక ఆదాయం

మొదటిపేజీ తరువాయి
తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో ఇసుక తవ్వకాల ద్వారా వచ్చిన ఆదాయం కేవలం 39 కోట్లే అని తెలిపారు. కానీ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న సంస్కరణలతో ఇసుక ఆదాయం గణనీయంగా పెరిగిందని అన్నారు. ఒక్క సంవత్సరంలోనే రూ.886 కోట్లకు చేరిందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇసుక ధర టన్నుకు రూ.645 మాత్రమే ఉండేదని.. ప్రజలకు అందుబాటులో ఉండేదని క్రిశాంక్ తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో సాండ్ బజార్ పేరుతో ఇసుక ధరను రూ.1600కు పెంచి, అదనంగా రవాణా భారం కూడా ప్రజలపై మోపుతోందన్నారు. సర్వీస్ ఛార్జీలు టన్నుకు కాంగ్రెస్ ప్రభుత్వం ?3 నుంచి ?100కు పెంచబడినప్పటికీ, ఆదాయం మాత్రం పెరగకపోవడం అనుమానాస్పదమని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే ఇసుక తవ్వకాలు జరగ్గా, ఇప్పుడు పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించి ఉదయం 6 నుంచి రాత్రి 9 వరకు తవ్వకాలు, 24 గంటల రవాణా అనుమతించినప్పటికీ ఆదాయం రెట్టింపు కాలేదని మన్నె క్రిశాంక్ తెలిపారు. ఈ పరిస్థితి చూస్తే ఇసుక ఆదాయం సాండ్ మాఫియా చేతుల్లోకి వెళ్లిపోతుందనే అనుమానాలు బలపడుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా, ప్రస్తుత ముఖ్యమంత్రి కార్యాలయ సీపీఆర్వోగా ఉన్న గుర్రం మల్సూర్ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో టీఎస్ఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. కాబట్టి, ఆయనకు వాస్తవ గణాంకాలు బాగా తెలుసని క్రిశాంక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ విజయాలను వక్రీకరించి, తప్పుడు గణాంకాలతో ప్రజలను మోసం చేస్తోంది అనే విషయంపై సీపీఆర్వో మల్సూర్ వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇసుక తవ్వకాల ఆదాయంపై పారదర్శకత కోసం పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడించాలన్నారు. తెలంగాణ ప్రజలపై భారం మోపుతూ, వాస్తవాలను దాచిపెట్టి ప్రభుత్వాన్ని నడపడం సరికాదని హితవుపలికారు. నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

## కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్త

మొదటిపేజీ తరువాయి
అయితే.. నోరూరించే ఈ ఫలాల మాటున ప్రాణాంతకమైన విషకోరలు దాగున్నాయన్న నిజాన్ని ప్రజల మరవకూడదని హెచ్చరిస్తూ.. 'కల్తీ మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త!' అని ఎక్స్ వేదికగా వివరించారు. మార్కెట్లలో ఎక్కడైనా కల్తీ మామిడి పండ్లను విక్రయించినా, ఆ సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100కి గానీ, హెచ్-ఫాస్ట్ ఫోన్ నంబర్ 8712661212కు కాల్ చేయాలని సజ్జనార్ సూచించారు.

## బిఆర్ఎస్‌లో ఇంటి గొడవలు

మొదటిపేజీ తరువాయి
రాష్ట్రంలో 100 సీట్లు ఖాయం' అని అన్నారు. బీజేపీ కులం, మతం పేరుతో రాజకీయాం చేస్తోందని..ఆ పార్టీకి తెలంగాణలో స్థానం లేదని విమర్శించారు. రాముడేమైనా బీజేపీ జాగీరా....వాళ్ల పార్టీల సభ్యత్వం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనట్టుగా తెలంగాణలో ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. సన్నబియ్యం పథకం దేశంలోనే చారిత్రాత్మకమన్నారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు కాంగ్రెస్ కడుతోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో నేతల జేబుల్లోకి డబ్బులు వెళ్లాయన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు స్కీం సక్సెస్ గా నడుస్తోందన్నారు. బీజేపీ రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదన్నారు. కేంద్రం లాభాల్లో ఉన్న సంస్థలను అమ్మేస్తోందని విమర్శించారు. 12 ఏండ్లలో కేంద్రం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు మహేశ్ కుమార్ గౌడ్. ఇందిగాంధీ నుంచి రాహుల్ వరకు పేదల కోసం పనిచేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారని అన్నారు. దోచుకున్న సొత్తులో వాటాల గొడవలతో ఆ పార్టీ రోడ్డున పడిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కు 100 సీట్లు గ్యారంటీ అని ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సమ్మిట్ తో 5 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయన్నారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని చెప్పారు మహేశ్ కుమార్ గౌడ్. ఈ కర్యాక్రమంలో మంత్రి వివేక్‌తో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.

## గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

మొదటిపేజీ తరువాయి
ఈ దేవాలయ అభివృద్ధికి, గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో చేశారు. మా తండాలో మా రాజ్యం అంటే ఎవ్వరూ పట్టించుకోలేదు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌ది. అన్ని రంగాల్లో కేసీఆర్ వారికి రిజర్వేషన్లు తెచ్చారు. గిరిజనులకు ఇప్పుడు కాంగ్రెస్ చేసింది గుండు సున్నా. ఎస్సీ, ఎస్టీలకు డిక్లరేషన్ ఇచ్చి వారు చేసిందేమీ లేదు. రూ.2,730 కోట్లు ఎస్టీలకు బ్జడెట్‌లో పెట్టి కేవలం రూ.50 కోట్లే ఖర్చు చేశారు.

గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.. ఒక్కరికీ ఇవ్వలేదు. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యకు దూరం చేస్తున్నారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్లు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా ఇవ్వడం లేదని ఆక్షేపించారు. సంత్ సేవాలాల్ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎస్టీల ఓట్లు కావాలిగానీ, వాళ్ల సంక్షేమం పట్టించుకోరా?అని ప్రశ్నించారు. కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేశామని బడాయి మాటలు చెబుతున్నారని విమర్శించారు.

మా లంబాడీలను దగా చేశారు. సీఎం రేవంత్, ఆయన మనుమడు ఫుట్ బాల్ ఆడేందుకు డబ్బులు ఉంటాయి కానీ ఎస్టీలకు ఇచ్చేందుకు లేవా?. లగచర్లలో లంబాడీల భూములు గుంజుకుని సీఎం రేవంత్ రెడ్డి వారిని జైలులో పెట్టారు. ఇక్కడ చేసింది చాలదని కేరళకు పోయి గొప్పలు చెబుతున్నారు. ఇంట్లో ఈగల మోత అంటే కేరళపోయి పల్లకీల మోత అన్నట్లు ఉంది. కొడంగల్ నియోజకవర్గంలో ఏ గ్రామంలో రుణమాఫీ వంద శాతం జరిగిందో రేవంత్ చూపించాలని సవాల్ చేశారు. నేను కొడంగల్ వచ్చినా గ్రామసభల్లో మీ నాయకులను జనం నిలదీస్తున్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని నిర్లక్ష్యం చేశారు. ప్యాకేజ్-3లో కొంత పని మాత్రమే మిగిలి ఉంది. త్వరగా ఆ పని పూర్తి చేస్తే కేసీఆర్‌కు పేరొస్తుందని చేయల్లేదు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాం. మీ నిర్లక్ష్యం వల్ల పాలమూరు ప్రజలకు అన్యాయం జరిగిందని అన్నారు.

## కాంగ్రెస్‌పై రెండేళ్లలోనే ప్రజల్లో వ్యతిరేకత

మొదటిపేజీ తరువాయి
రేవంత్ రెడ్డి పోవాలనే ఆలోచన వచ్చిందన్నారు. జగిత్యాలలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజల సంక్షేమంతో పాటు ప్రాజెక్టుల నిర్వహణ ప్రధాన అంశమని తెలిపారు. తెలంగాణకు జీవనాడి ప్రాణహిత జలాలను వాడుకోవడంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని ఆయన తెలిపారు. అభిమానుల ఆలోచనలకు అనుగుణంగా ఏ పార్టీలో చేరాలనేదానిపై నిర్ణయం తీసుకుంటానని జీవన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌ను వీడిన తర్వాత జగిత్యాలలో తొలిసారిగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ప్రాణహిత నదీ జలాలను వినియోగించుకోకపోవడం, పునరుద్ధరించకపోవడం రేవంత్ నిర్లక్ష్య పాలనకు నిదర్శనమని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన రెండేళ్లలోనే మార్పు రావాలనే పరిస్థితి వచ్చిందన్నారు. భాజపా, బీఆర్ఎస్ నాయకులకు తనపై ఉన్న అభిమానానికి జీవన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అయితే మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. త్వరలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలకు వెళ్లి జీవన్ రెడ్డిని ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 13న జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఆ రోజు మంచి ముహూర్తం ఉండటంతో గులాబీ కండువా

కప్పుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నెల 6న అమెరికా నుంచి తిరిగి వచ్చిన వెంటనే కేటీఆర్.. జీవన్ రెడ్డిని కలిసి పార్టీలోకి ఆహ్వానించనున్నట్లు సమాచారం. జగిత్యాల నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌ను బలోపేతం చేసేందుకు జీవన్ రెడ్డిని పార్టీలోకి తీసుకోవాలని కేటీఆర్ భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి, క్రియాశీల సభ్యత్వానికి జీవన్ రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసిన ఆయన.. నిత్యం జనంలోనే ఉంటూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల ప్రాంతంలో బలమైన నేతగా ఉన్న జీవన్ రెడ్డి.. గులాబీ పార్టీలో చేరితే స్థానికంగా బీఆర్ఎస్‌కు మంచి ప్రయోజనం కలుగుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## తెలంగాణలో ఏం చేశారని.. కేరళలో రేవంత్ ప్రచారం: కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి
ఆరు గ్యారంటీల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిలో ఎన్ని నెరవేర్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఏం చేశారని, కేరళలో రేవంత్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ చేసిన తరహాలోనే రేవంత్‌రెడ్డి కూడా ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. బీసీలకు మేం అన్యాయం చేశామని అంటున్నారు.. బీసీలకు కాంగ్రెస్ ఏం చేసిందో రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసగించింది కాంగ్రెస్ పార్టీయేనని దుయ్యబట్టారు. ఆరు గ్యారంటీలు అమలు చేసినట్లు కేరళలో గొప్పలు పలుకుతున్న రేవంత్.. భవిష్యత్‌లో తెలంగాణలోనూ అదే తరహా మాటలు చెప్పే ప్రమాదముందని అన్నారు.

## టెక్స్‌టైల్‌రంగంలో తెలంగాణ అగ్రగామి

మొదటిపేజీ తరువాయి
ఇందులో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యం అని పేర్కొన్నారు. ఇంకా 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా మార్చడమే మా సంకల్పం అని అన్నారు. అలాగే వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, పత్తి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడిదారులకు ఆయన పిలుపునిస్తూ.. 'మీకు విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములం. మౌలిక సదుపాయాలు, భూమి, విద్యుత్, నీరు, వేగవంతమైన అనుమతులతో పాటు ప్రపంచ స్థాయి విధానాలను మా ప్రభుత్వం అందిస్తుంని అంటూ హామీ ఇచ్చారు. డీప్ టెక్, ఫార్మా, ఏరోస్పేస్ వంటి రంగాల్లో ఇప్పటికే ముందంజలో ఉన్న తెలంగాణ, ఇప్పుడు టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్ ను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. మరోవైపు హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలను ప్రారంభించడాన్ని ఆయన ప్రస్తావించారు. టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాక హాలీవుడ్ కూడా హైదరాబాద్ ను కేంద్రంగా చేసుకుంటున్న తరుణంలో సినిమా రంగానికి అవసరమైన ఫ్యాషన్ ను కూడా తెలంగాణ నుంచే అందించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ 'గ్రీన్ టెక్స్‌టైల్ హబ్' లను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.

## తవణంపల్లి మండలంలో దారుణ ఘటన

### - యువకుడిని హత్యచేసి చెరువుల పడేసిన దుండగులు

చిత్తూరు జిల్లాలోని తవణంపల్లి మండలంలో దారుణ ఘటన వెలుగుచూసింది. మొదలపల్లి గ్రామానికి చెందిన లవ కుమార్ (28) అనే యువకుడిని గుర్తు తెలియని దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని సమీప చెరువులో పడేశారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికుల సమాచారం ప్రకారం.. లవకుమార్ గత కొంత కాలంగా అమర్ రాజా కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు అతడిని హతమార్చి, మృతదేహాన్ని సమీపంలోని చెరువులో పడేశారు. చెరువులో మృతదేహం తేలడాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పాత కక్షల వల్ల ఈ హత్య జరిగిందా? లేక మరేదైనా కారణం ఉందా అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంలో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించిన పోలీసులు, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## నేటి నుంచి రబీ ధాన్యం కొనుగోళ్లు

### - రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాలు
### - వెల్లడించిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు శుభవార్త చెప్పింది.. నేటి నుంచి రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలియజేశారు.. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,917 కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.ఇక, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు. రైతులు తమ పంటకు సరైన ధర పొందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ధాన్యం నిల్వ మరియు రవాణా విషయంలో కూడా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసింది. మొత్తం 5.40 కోట్ల గోతాలను సిద్ధం చేసినట్లు, గోతాల కొరత రాకుండా మిల్లర్లతో ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలిపారు. అలాగే ధాన్యం రవాణా కోసం 17,200 లారీలను జీపీఎస్ సదుపాయంతో సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మొత్తంగా, ఈసారి రబీ ధాన్యం కొనుగోళు పారదర్శకంగా, వేగంగా జరిగేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు ..

## బిసిలను మోసం చేసిన కాంగ్రెస్

- వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చని ప్రభుత్వం
- మహబూబ్‌నగర్‌లో దొడ్డి కొమురయ్యకు హరీష్ నివాళి

బీసీలకు,కుర్వ, గొల్ల, కురుమలకు రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలో కొమురయ్య విగ్రహానికి మాజీ మంత్రులు హరీష్ రావు, శ్రీనివాస్ గౌడ్ , లక్ష్మారెడ్డి , ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ బీసీలకు వేల కోట్ల బడ్జెట్ ఇస్తామని కేవలం రూ. 7 కోట్లు మాత్రమే నిధులు ఖర్చు చేసినట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. శాసన సభలో రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీసినట్టు వెల్లడించారు. యాదవులకు గొర్ల ఇస్తామని, నగదు బదిలీ పథకం అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని తెలిపారు. కనీసం మంత్రి వర్గంలో అవకాశం కల్పించలేదని చెప్పారు.దొడ్డి కొమురయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్ కేసీఆర్‌ను కోరితే వెంటనే అధికారికంగా నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చినట్టు చెప్పారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ పచ్చబడాలని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు హరీష్ రావు అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. గతంలో 14 రోజులకు ఒకసారి నీళ్లు రాగా బీఆర్ఎస్ హయాంలో ప్రతి రోజు నీళ్లు ఇచ్చామని వివరించారు.రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేమని, సాగు నీరు అందించేందుకు పూర్తి ప్రయత్నాలు చేసామని తెలిపారు. పాలమూరు ప్రాజెక్ట్ 90 శాతం పూర్తి చేశామని వెల్లడించారు. రాజకీయంగా బీసీలకు సమాన అవకాశాలు కల్పించాలని, బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ లు ఇస్తామని మోసం చేశారని తెలిపారు .విద్య,ఉద్యోగాల్లో కూడా రిసర్వేషన్ ఇవ్వడం లేదని ఆరోపించారు.

## అమరావతిపై పరస్పర విరుద్ధ ప్రకటనలు

అమరావతిపై జగన్ మాట్లాడిన మాటలు చూస్తే ఆయన మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. అమరావతిపై జగన్‌లా ఇన్ని ప్రకటనలు చేసిన వ్యక్తి ప్రపంచంలో మరెవరూ ఉండరంటూ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. మతిస్థిమితలం లేని వ్యక్తిలా ఆయన మాటలు ఉన్నాయని అన్నారు. పరస్పర విరుద్ధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో అమరావతి రాజధాని బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు . ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి వివిధ సందర్భాల్లో రాజధాని గురించి మాట్లాడిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే విడుదల చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా అమరావతిని అంగీకరించారని.. గెలిచిన తర్వాత మూడు రాజధానులు అన్నారని గంటా శ్రీనివాస్ తెలిపారు. అమరావతి తీర్మానంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశానికి కూడా హాజరు కాలేదన్నారు. పార్లమెంట్‌లో అమరావతికి వ్యతిరేకంగా ఉన్న ఏకైక పార్టీ వైసీపీ అని తెలిపారు. మొన్నటి వరకు ఉత్తరాంధ్ర అన్న జగన్.. ఇప్పుడు మావిగన్ అని అంటున్నారని అన్నారు. మాజీ సీఎంకు ఏ అంశంపైనా ఒక స్థిరమైన అభిప్రాయం లేదని ఎమ్మెల్యే విమర్శించారు. వైసీపీకి 151 సీట్ల నుంచి 11 సీట్లకు ప్రజలు తీర్పు ఇచ్చినా జగన్ మారడం లేదన్నారు ఎమ్మెల్యే. ఏప్రిల్ 15వ తేదీ లోపు గూగుల్ శంకుస్థాపన చేయొచ్చని వెల్లడించారు. అమరావతి కలల రాజధానిని సాధించుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం అమరావతి ప్రజలను ఎన్ని ఇబ్బందులు పెట్టిందో అంతా చూశారన్నారు. రాష్ట్రపతి ఆమోదంతో జగన్ రాజధాని అమరావతిని ఇంచు కూడా కదపలేరని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# ప్రజా పాలన ప్రణాళిక ప్రగతి కార్యక్రమం ఘనంగా నిర్వహించిన మున్సిపల్ కౌన్సిలర్ కొలుగూరి సురేష్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 3**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని 8వ వార్డు మారుతి నగర్‌లో స్థానిక కౌన్సిలర్ కొలువురి సురేష్ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి వార్డు ప్రజలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను తెలియజేశారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం, వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ కొలువురి సురేష్ మాట్లాడుతూ, “8వ వార్డు అభివృద్ధే నా లక్ష్యం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే స్పందించి పరిష్కారం చూపడం నా బాధ్యతగా భావిస్తున్నాను. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు వంటి ప్రాథమిక సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు కృషి చేస్తాను” అని హామీ ఇచ్చారు. అలాగే పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ప్రతిరోజూ పారిశుద్ధ్య కార్మికులతో కాలువలు, రోడ్లు



శుభ్రం చేయించే విధంగా పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు.

ఇక వార్డులో ఎక్కడైనా మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని, చెత్త పేరుకుపోకుండా క్రమం తప్పకుండా శుభ్రపరిచే కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడం కోసం శుభ్రతే ప్రధాన ఆయుధమని, అందరూ కలిసికట్టుగా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని, ఎవరికైనా పథకాల విషయంలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంశెట్టి రమేష్, మొలుగురి సదయ్య, ఎగ్గాని శ్రీనివాస్, ఏబీసీ ఓదెలు, పద్మ, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, కౌన్సిలర్ చేస్తున్న సేవలు అభినందనీయమని, ఇలాంటి ప్రజా కార్యక్రమాలు మరింతగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమం అనంతరం కొందరు స్థానికులు తమ సమస్యలను నేరుగా కౌన్సిలర్ దృష్టికి తీసుకువచ్చారు.

మొత్తంగా ఈ ప్రజాపాలన ప్రగతి కార్యక్రమం ద్వారా 8వ వార్డు ప్రజల్లో నూతన ఉత్సాహం నింపుతూ, సమస్యల పరిష్కారానికి ఒక వేదికగా నిలిచింది. ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ, ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని కోరారు.

# రోడ్డు ప్రమాదానికి గురై బిట్ల కిరణ్‌ను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 3**
జమ్మికుంట పట్టణ పరిధిలోని మోత్కులగూడెం గ్రామానికి చెందిన బిట్ల కిరణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన విషయం తెలిసిందే. చికిత్స పొందిన అనంతరం క్రమంగా కోలుకుని ఇంటికి చేరుకున్న ఆయనను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) స్వయంగా వెళ్లి పరామర్శించారు.



ఈ సందర్భంగా కిరణ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, ఆయన త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదం తరువాత ఎదురైన ఇబ్బందులను తెలుసుకుని, అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కిరణ్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి, ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.“త్వరలోనే కిరణ్ మామూలు జీవన విధానానికి తిరిగి వచ్చి అందరితో కలిసిమెలిసి ఉండాలని కోరుకుంటున్నాం” అని చైర్మన్ పేర్కొన్నారు. సమాజంలో ఇలాంటి సమయంలో ఒకరికి ఒకరు తోడుగా ఉండడం ఎంతో ముఖ్యమని ఆయన సూచించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పొనగంటి విష్ణు, బిట్ల తిరుపతి, ఇతర నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కిరణ్ త్వరగా కోలుకోవాలని వారు కూడా ఆకాంక్షించారు.స్థానిక ప్రజలు మున్సిపల్ చైర్మన్ స్పందనపై సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండడం అభినందనీయమని పేర్కొన్నారు.

# అపర భద్రాద్రిలో చంద్ర రథోత్సవానికి (పెద్ద రథం) అట్టహాసంగా సిద్ధం...

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట ఏప్రిల్ 3**
ఇల్లందకుంటలో విస్తృత ఏర్పాట్లు -- భక్తుల రాకతో కిక్కిరిసే అవకాశం భారీ సంఖ్యలో హాజరుకానున్న భక్తులు -- ప్రత్యేక సదుపాయాలతో సిద్ధమైన దేవస్థానం

ఇల్లందకుంట అపర భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది మరింత వైభవంగా జరుగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధాన ఘట్టంగా భావించే చంద్ర రథోత్సవం (పెద్ద రథం) నిర్వహణకు దేవస్థానం కమిటీ అన్ని విధాలుగా సన్నద్ధమైంది. ఇప్పటికే ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కళకళలాడుతున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి సుధాకర్, కమిటీ సభ్యులు కలిసి రథోత్సవ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా రథ మార్గాన్ని శుభ్రపరిచి, విద్యుత్ వెలుగులతో అలంకరించడం, భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేయడం వంటి చర్యలు చేపట్టారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడం తో పాటు, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వైట్ పాండాల ద్వారా నీడ సదుపాయం కల్పించారు. త్రాగునీటి కోసం అనేక ప్రదేశాల్లో వాటర్





ట్యాంకులు, చల్లని నీటి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదనంగా, ప్రాథమిక వైద్య సేవల కోసం ప్రత్యేక మెడికల్ క్యాంపులు, అంబులెన్స్ సౌకర్యం కూడా సిద్ధంగా ఉంచారు. శుక్రవారం రాత్రి 11 గంటల నుండి శనివారం మధ్యాహ్నం 3 గంటల వరకు స్వామివారు చంద్ర రథంపై ఆశీనులై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా ఆలయ వాతావరణం భక్తి భావంతో మారుమ్రోగనుంది. అనంతరం మధ్యాహ్నం 4 గంటల తర్వాత ఒగ్గు కళాకారుల ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ఈ ప్రదర్శనలు భక్తులను అలరించనున్నాయి. తర్వాత భక్తుల జయజయధ్వానాల మధ్య పెద్ద రథోత్సవం దేవస్థానం మాడవీధుల గుండా ఘనంగా ఊరేగింపుగా సాగనుంది. రథాన్ని లాగడానికి వేలాది మంది భక్తులు ఉత్సాహంగా పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలో భక్తి, సంప్రదాయం, సంస్కృతి అన్నీ కలిసిన అద్భుత దృశ్యం కనువిందు చేయనుంది. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని దేవస్థానానికి అన్ని ప్రాంతాల నుండి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపబడుతున్నాయి. రవాణా, పార్కింగ్ ఏర్పాట్లు కూడా సమర్థంగా చేపట్టారు. భక్తులు సౌకర్యవంతంగా వచ్చి తిరిగి వెళ్లేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు గోడిశాల పరమేష్, కిరణ్, చిరంజీవి, గోపాల్ కిషన్, ఆలయ అధికారులు మోహన్, సురేందర్, మల్లారెడ్డి, గ్రామ పెద్దలు రామ్ రెడ్డి తదితరులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏర్పాట్లను విజయవంతం చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కరుణాకటాక్షాలు పొందాలని ఆలయ అధికారులు పిలుపునిచ్చారు. ఇల్లందకుంట అపర భద్రాద్రిలో జరగనున్న ఈ చంద్ర రథోత్సవం ఆధ్యాత్మిక ఉత్సాహానికి ప్రతీకగా నిలవనుంది.


# రోడ్డు ప్రమాదానికి గురై బిట్ల కిరణ్‌ను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 3**



జమ్మికుంట పట్టణ పరిధిలోని మోత్కులగూడెం గ్రామానికి చెందిన బిట్ల కిరణ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన విషయం తెలిసిందే. చికిత్స పొందిన అనంతరం క్రమంగా కోలుకుని ఇంటికి చేరుకున్న ఆయనను మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) స్వయంగా వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా కిరణ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, ఆయన త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదం తరువాత ఎదురైన ఇబ్బందులను తెలుసుకుని, అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కిరణ్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి, ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.“త్వరలోనే కిరణ్ మామూలు జీవన విధానానికి తిరిగి వచ్చి అందరితో కలిసిమెలిసి ఉండాలని కోరుకుంటున్నాం” అని చైర్మన్ పేర్కొన్నారు. సమాజంలో ఇలాంటి సమయంలో ఒకరికి ఒకరు తోడుగా ఉండడం ఎంతో ముఖ్యమని ఆయన సూచించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ పొనగంటి విష్ణు, బిట్ల తిరుపతి, ఇతర నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కిరణ్ త్వరగా కోలుకోవాలని వారు కూడా ఆకాంక్షించారు.స్థానిక ప్రజలు మున్సిపల్ చైర్మన్ స్పందనపై సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండడం అభినందనీయమని పేర్కొన్నారు.


# ఉపాధ్యాయ ,ఉద్యోగ పెన్షనర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్న ప్రభుత్వ విధానం.

**- టీఎస్ టి యు రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్లా**

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 3**
కడార్ల సత్యనారాయణ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగ విరమణ అభినందన సమావేశం కు ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ
అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దినసరి బత్యం ,వేతన సవరణ అమలు ,పెన్షనర్ల బకాయిలు వెంటనే చెల్లిస్తామని వాగ్దానాలు గుప్పించి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల కాలం పూర్తి అయిన హామీలు విస్మరిస్తున్న ప్రభుత్వ విధానాలు పూర్తిగా ఉపాధ్యాయ ,ఉద్యోగ ,పెన్షనర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్నాయని టీఎస్ టి యు రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్లా ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందూరి



రాజిరెడ్డి ఆక్షేపించారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం వేతన సవరణ అమలు కాలం దాటి సంవత్సరాలు గడిచిన ఈనాటికి పిఆర్సి నివేదిక బయట పెట్టకపోవడం దారుణం అన్నారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు కొరకు ప్రతినెల 1000 కోట్లు ఇస్తున్నప్పటికీ ఇంతకుమించి కొత్త బిల్లులు ఖజానాలోకి చేరడం వలన వేలాదిమంది పెన్షనర్లు బకాయిల కొరకు ఆందోళన చెంది అకాల మరణం పొందుతున్న ప్రభుత్వ పెద్దల మనసు కరగడం లేదన్నారు. ఒకవైపు రూపాయి విలువ నానాటికి తగ్గిపోతూ నిజ వేతనాలు తగ్గాయని, ధరలు, ద్రవోల్బణం పెరగడం వలన ఉద్యోగ ,ఉపాధ్యాయ ,పెన్షనర్లు ఆర్థికంగా చితికి పోతున్నారు .అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో మార్పుల పేరుతో వివిధ రకాల పాఠశాలల ఏర్పాటును ఆర్భాటంగా ప్రకటిస్తూ పోతున్నాయని ,అలా కాకుండా కామన్ స్కూల్ విధానం తీసుకువచ్చినప్పుడే నాణ్యమైన విద్య అందడం తో పాటు సమాజంలో అంతరాలు చెరిగి పోతాయని తెలిపారు. ఈ అభినందన సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కాలువ లక్ష్మణ్ ,రాష్ట్ర ఉపాధ్యక్షులు బి కృష్ణ ,జగిత్యాల, కరీంనగర్, పెద్దపెల్లి జిల్లా శాఖ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాసరెడ్డి ,కొమురయ్య ,సత్యనారాయణ రెడ్డి , కిషోర్ ,దాసరి రవి నాయకులు రహమతుల్లా హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేశ రఘు, ఆర్.సీతారెడ్డి ,చంద్రశేఖర్ ,అశోక్ కుమార్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంథని లో ఘనంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతి

**కరపత్రం ప్రతినిధి మంథని ఏప్రిల్ 3**
మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు ఛత్రపతి శివాజీ మహరాజ్ వర్ధంతి నీ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు బ్రిడ్జి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి గణంగా నివాళు లు అర్పించారు అనంతరం బీఆర్ఎస్



మండల అధ్యక్షులు ఏగోళం శంకర్ గౌడ్ మాట్లాడుతూ మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, పరాక్రమ వంతుడైన ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 3న జరుపుకుంటారనీ ఆయన 17వ శతాబ్దపు గొప్ప హిందూ యోధుడు, శివాజీ జయంతి (ఫిబ్రవరి 19) మరియు వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా, ముఖ్యంగా మహారాష్ట్రలో ఆయన వారసత్వాన్ని, ప్రజల పట్ల ఆయన నిబద్ధతను స్మరించుకుంటూ నివాళులర్పిస్తారనీ హిందూ ధర్మ పరిరక్షణ, స్వరాజ్య స్థాపన, మరియు అద్భుతమైన పరిపాలనా దక్షతకు శివాజీ ప్రతీక. నివాళిఅని అన్నారు: ఈ రోజున ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు, మరియు ప్రసంగాల ద్వారా ఆయన ధైర్యసాహసాలను, గెరిల్లా యుద్ధ తంత్రాలను (గనిమి కవా) ప్రజలు స్మరించుకుంటారనీ 17వ శతాబ్దంలో మొఘల్ రాజవంశాన్ని ఎదిరించి, మరాఠా రాజ్యాన్ని స్థాపించిన యోధుడు గా చరిత్రలో నిలిచిపోయారనీ శివాజీ మహారాజ్ ఆశయాలను స్మరించుకుంటూ, ఆయన ధైర్య మార్గంలో నడవాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బండ పోసానిపల్లి గ్రామంలోపెద్దమ్మతల్లి మూడో వార్షికోత్సవం

- పెద్దమ్మ తల్లి కి బోనాలు ప్రత్యేక పూజలలలో పాల్గొన్నా నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ఆవుల రాజిరెడ్డి
- పలు పార్టీల కార్యకర్తలు నాయకులు
- ముదిరాజ్ కులస్తులు

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 3**
మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంమండల పరిధి లోని బండ పోసానిపల్లి గ్రామంలో శుక్రవారం ఆధ్యాత్మిగంగా పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలుజరిగాయి. బండ పోసానిపల్లి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన పెద్దమ్మ ఆలయమూడో వార్షికోత్సవం పురస్కరించుకుని అమ్మవారికి పంచామృత విశేషాలు కల్యాణోత్సవం మొక్కుబళ్ళ ఒడిబియాలు సమర్పించారు. దుర్గామాతకు బోనాలు నిర్వహించారు.కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు గ్రామస్తులు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకుంటున్నారు. ముదిరాజుల కుల దైవము








అయినటువంటి పెద్దమ్మ దేవతకు బోనాల సంబరాలను జరుపుకోవడం ఎంతో సంతోషకరమని కలకాలం ఇలాగనే అమ్మవారి దీవెనల తో ప్రతి సంవత్సరం జరుపుకోవాలని పెద్దమ్మ తల్లిని కోరుకుంటున్నానని అందరం బాగుండాలని అందరూ మనందరం కూడా ఒక శాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని మాత అమూర్తులను కోరుకుంటున్నానని వారు తెలియజేసారు బండ పోసాని పల్లి గ్రామాన్ని పెద్దమ్మ తల్లి దీవెనలతో కాంగ్రెస్ ప్రభుత్వ ఆయాయంలో ఎంతో అభివృద్ధి చెందాలని తాను కోరుకుంటున్నానని గ్రామ ప్రజల సంక్షేమమే తన వ్యయంగా వ్యవహరిస్తానని గ్రామంలోని ఎటువంటి సహాయ సహకారాలు అవసరం ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే తాను మీ మనిషిని మీకు ఉన్న ఇబ్బందులుటువంటి బాధలను తీర్చే విధంగానే అందరితో మమేకంగా ఉంటూ మీ సమస్య నా సమస్యగా భావించి మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని వారు తెలియజేశారు ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు విగ్నేష్ గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార పార్టీ నాయకులు మహేష్ రెడ్డి అన్వేష్ నర్సింహారెడ్డి సుధాకర్ గౌడ్ శంకర్ గౌడ్ వెల్దుర్తి సొసైటీ మాజీ డైరెక్టర్మ నాలాచెరువు కిష్ట గౌడ్ జిల్లా కాంగ్రెస్ మహిళ ఉపాధ్యక్షురాలు ముక్తాబాయ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు..

# పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు మాజీమంత్రి పేర్ని నానిపై పోలీస్ కేసు

మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానిపై చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. గురువారం మచిలీపట్నం కొబ్బరి తోటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత ఘటన నేపథ్యంలో పోలీసులపై మాజీ మంత్రి అనుచిత వ్యాఖ్యలు చేశారు. చిలకలపూడి సీఐ పరమేశ్వరరావును బాడీ షేమింగ్ చేస్తూ అవమానించారు. అంతేకాకుండా పోలీసులను బెదిరించారు. పోలీసుల పట్ల మాజీ మంత్రి వ్యవహరించిన తీరుపై కృష్ణా జిల్లా పోలీస్ అధికారుల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీస్ అధికారుల సంఘం ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో పేర్ని నానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిన్న మచిలీపట్నం కొబ్బరితోటలో అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై స్పందించిన పేర్ని నాని పోలీసులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎవ్వరినీ వదలమని, తమ ప్రభుత్వం వచ్చాక అంతు చూస్తామంటూ పోలీసులను ఉద్దేశించి పేర్ని నాని వ్యాఖ్యలు చేశారు.

# కృష్ణవేణి హై స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మరియు స్పోర్ట్స్ డ కల్చరల్ మీట్

## – విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసానికి నాంది




**కరపత్రం ప్రతినిధి మంథని ఏప్రిల్ 3**
మంథని పట్టణంలోని కృష్ణవేణి హై స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను పాఠశాల ప్రిన్సిపల్ అరిసె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తమ ప్రాథమిక విద్యను పూర్తి చేసి ఉన్నత విద్య దిశగా అడుగులు వేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య అనేది వ్యక్తిత్వ వికాసానికి పునాది అని, ప్రాథమిక దశలోనే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, లక్ష్యసాధన వంటి విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్ డే వంటి వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు భవిష్యత్ లక్ష్యాల వైపు దృష్టి సారించేందుకు ప్రేరణనిస్తాయని తెలిపారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జాఫర్ హుస్సేన్, సుదర్శన్ రెడ్డి, నరేష్ లు , ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రోడ్డుపై పడిన యువకుడు

- గోదావరిఖని పోలీసుల సహాయం



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 03:**
గోదావరిఖని పవర్ హౌస్ కాలని గ్రంధాలయం ప్రాంతంలో యువకుడు తన స్కూటి నడిపే పరిస్థితిలేక అదుపు తప్పి రోడ్డు ప్రక్కన క్రింద పడిపోయి మొహంపై రక్తగాయాలు కావడం జరిగింది. గురువారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి యువకున్ని గమనించి అతనిని లేపి వాటర్ అందించి అతని వివరాలు అడిగి తెలుసుకొని యువకుని స్నేహితునికి ఫోన్ చేసి పిలిపించి అతనిని అప్పగించి హాస్పిటల్ కి తీసుకువెళ్ళమని సూచించారు. తాత్కాలిక ఆనందాల కోసం యువత ప్రమదాలకు గురికావద్దని, ప్రాణాలు కోల్పోయి, గాయాల పాలై తల్లితండ్రులకు, కుటుంబ సభ్యులకు మానసిక క్షోభకి గురి చేయవద్దని, భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సీఐ సూచించారు.

# 19 ఏళ్ల వయసులోనే ప్రాణాలర్పించిన తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య: పర్శ బక్కన్న





**కరపత్రం ప్రతినిధి మంథని ఏప్రిల్ 3**
దొడ్డి కొమురయ్య (1927–1946) తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశత్వం, భూస్వాముల వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా పోరాడి, 19 ఏళ్ల వయసులోనే ప్రాణాలర్పించిన తొలి అమరవీరుడు. కడవెండి గ్రామానికి చెందిన ఈ కురుమ వీరుడు, "భూమి, భుక్తి, విముక్తి" కోసం జనం తిరగబడటంలో కీలక స్ఫూర్తిగా నిలిచారని దొడ్డి కొమురయ్య విగ్రహ కమిటీ చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పర్శ బక్కన్న అన్నారు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా బొక్కలవాగు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలువేసి ఘన నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఏగోళం శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మయ్య,బీఆర్ఎస్ నాయకులు తగరం శంకర్ లాల్,మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల గట్టయ్య,మాజీ కౌన్సిలర్ కాయితీ సమ్మయ్య,సర్పంచ్ కొమురయ్య,నాయకులు పుప్పాల తిరుపతి, జంజర్ల శేఖర్, అంబటి నర్సింగ్,ఆసిఫ్ ఖాన్,మంథని లక్ష్మణ్,జక్కుల ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందకుంట రథోత్సవానికి కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాక

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 3**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో బిజెపి నాయకులు టంగుటూరు రాజ్ కుమార్ మాట్లాడుతూ శనివారం రోజున భారీ బైక్ ర్యాలీకి పిలుపు -- కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి ఇల్లందకుంట అపర భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న ఘనమైన రథోత్సవం (పెద్ద రథం) సందర్భంగా కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ గారు శనివారం మధ్యాహ్నం 1 గంటకు ఇల్లందకుంటకు విచ్చేయనున్నారు.
ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రథోత్సవ వేడుకల్లో పాల్గొని భక్తులతో కలిసి ఈ ఆధ్యాత్మిక వేడుకను మరింత వైభవంగా చేయనున్నట్లు సమాచారం. ఆయన రాకతో ఈ ఉత్సవానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది.
కావున కార్యకర్తలు, యువత, హిందూ భక్తులందరూ



పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. జమ్మికుంట పట్టణంలోని అయ్యప్ప స్వామి గుడి వద్ద నుండి శనివారం మధ్యాహ్నం 1:00 గంటలకు బైక్ ర్యాలీగా ఘనంగా బయలుదేరి ఇల్లందకుంటకు చేరుకోవాలని కోరారు.
ఈ ర్యాలీ భక్తి ఉత్సాహంతో పాటు ఐక్యతను చాటిచెప్పే విధంగా నిర్వహించబడనుంది. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ పాటిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు గౌరవిస్తూ ర్యాలీలో పాల్గొనాలని సూచించారు. భక్తులు కాషాయం జెండాలతో, నినాదాలతో ర్యాలీని ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్లాలని నిర్వాహకులు తెలిపారు.
అదేవిధంగా రథోత్సవంలో పాల్గొనే భక్తులందరూ శాంతి భద్రతలను కాపాడుతూ, నిర్వాహకుల సూచనలు పాటించాలని కోరారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో పోలీస్ మరియు వాలంటీర్ బృందాలు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నాయి.
ఈ పవిత్ర వేడుకలో భాగస్వాములు అవుతూ స్వామివారి కరుణాకటాక్షాలు పొందాలని, ఇల్లందకుంట రథోత్సవాన్ని మరింత ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# ప్రేమ సహనం శాంతికి నిర్వచనం క్రీస్తు

- మానవాళి పాప పరిహార్థం క్రీస్తు సిలువ మరణం : పాస్టర్ దూడ మహేష్

**కరపత్రం ప్రతినిధి మంథని ఏప్రిల్ 3**
ప్రేమ సహనం శాంతికి నిర్వచనం క్రీస్తు ప్రభువు అని, ఆయన చూపించిన మార్గంలో అందరు నడుస్తూ ప్రపంచం శాంతిమయం కావాలని, క్రీస్తు బోధ నలు ప్రపంచశాంతికి దిక్సూచి అని, యేసు అనుగ్రహం అందరిపై ఉండాలని పాస్టర్ దూడ మహేష్ పేర్కొన్నారు. క్రైస్తవుల పర్వదినం గుడ్ ఫ్రైడే పండుగ సందర్భంగా శుక్రవారం మంథని మున్సిపల్ పరిధి శ్రీపాదకాలనీ సీయోను చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకల్లో ఆయన మాట్లాడుతూ మానవాళి పాప పరిహార్థం క్రీస్తు సిలువ మరణం పొందాడని, ప్రేమ, సహనం, శాంతికి నిర్వచనం యేసు క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దిక్సూచి అని, మానవవాళికి ప్రేమ, శాంతిమార్గం చూపిన మహనీయుడు యేసుక్రీస్తు అని అన్నారు. అతడి అనుగ్రహం అందరిపైనా ఉండాలని తెలిపారు. జీసస్ బోధనలతో ప్రపంచ శాంతి మయం కావాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. యేసుక్రీస్తు ప్రభువు సత్యాన్ని ఏనాడు విడనాడలేదని, తను నమ్మిన



సిద్ధాంతం కోసం, తన భక్తుల కోసం ప్రాణాలు అర్పించిన గొప్పమహ నీయుడని ఆయనను కొనియాడారు. క్రీస్తు బోధనలు అందరూ అవగతం చేసుకొని, సన్మార్గంలో ముందుకెళ్లాలని ఆయన తెలిపారు. యేసు దైవత్వము సంబంధించిన విద్యను క్రిస్టోలోజి అని పిలు స్తారని, చరిత్రకారులు మానవ చరిత్రను యేసు క్రీస్తు జీవించిన కాలాన్ని కొలమానంగా తీసుకుంటారు. క్రీస్తు జన్మించకముందు కాలాన్ని క్రీస్తుపూర్వం అని, క్రీస్తు జన్మించిన తర్వాత కాలాన్ని క్రీస్తుశకం అని పేర్కొంటారని వివరించారు. క్రీస్తు ప్రభువు సూచించిన మార్గంలో నడుస్తూ ప్రతి ఒక్కరి హృదయాల్లో ప్రేమ నిండాలని తెలిపారు. ప్రేమ,




కరుణ, క్షమాగు ణాలను ఏసు తన జీవిత సందేశంగా మానవాళికి అందించారు.. ప్రతి మనిషి పరోపకారం అలవరుచుకోకపోతే జీవితానికి అర్థం ఉండదన్నారు. ఈ సందర్భంగా యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను ద్యానించారు. అనంతరం శ్రీపాద కాలనీ చర్చి నుండి అంబేద్కర్ చౌక్ వరకు సిలువ ధ్యాన సువార్త ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు మంథని మార్క్, అజ్మీరా దయారాజు, కలువల సామ్యూల్, చిప్పకుర్తి సుధాకర్, సంఘ పెద్దలు అంకరి కుమార్, ఎం కె జోసెఫ్, మంథని ప్రసాద్, అందే రమేష్, చింతకుంట్ల ప్రేమ్ కుమార్, దాసరి సదానందం, రామగిరి కుమార్, ఈర్ల సదా నందంతో పాటు స్త్రీల కమిటీ నాయకులు హేమలత, పద్మజ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# పరిశీలకే పరిమితమవుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి... పట్టించుకోని ఆర్ & బీ అధికారులు!

- ప్రజల ప్రాణాలతో ఆటలాడుతున్న నిర్లక్ష్యం --
- వెంటనే చర్యలు తీసుకోవాలన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 3**
జమ్మికుంట మున్సిపల్ పరిధిలో ప్రజలకు ప్రాణహాని కలిగించే స్థాయికి చేరుకున్న రోడ్లు, ఫ్లైఓవర్ బ్రిడ్జి పరిస్థితి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. ముఖ్యంగా ఇటీవల దెబ్బతిన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి మరమ్మతుల విషయంలో ఆర్ డ బీ (రోడ్స్ డ బిల్డింగ్స్) శాఖ అధికారులు కేవలం పరిశీలనలకే పరిమితమవుతూ, చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
ఈ నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) స్వయంగా సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించి, ఆర్ డ బీ డిఇ దృష్టికి తీసుకెళ్లారు. బ్రిడ్జి పై పలు చోట్ల ఏర్పడిన గుంతలు, చీలికలు ప్రమాదానికి ఆహ్వానం పలుకుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.
ప్రత్యేకంగా కొత్తపల్లి కెనాల్ సమీపంలోని ఫ్లైఓవర్



పరిస్థితి మరింత దారుణంగా ఉందని, అక్కడ ప్రయాణించే వాహనదారులు ప్రతి రోజు భయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎప్పుడెప్పుడు ప్రమాదం జరుగుతుందో అనే ఆందోళనలో ప్రజలు జీవిస్తున్నారని పేర్కొన్నారు.

**"జమ్మికుంటకు అనునిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు...**
**ఇలాంటి కీలక ప్రాంతంలో బ్రిడ్జి దెబ్బతిన్నా కూడా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం...**
ఎవరైనా ప్రాణాలు కోల్పోతే బాధ్యత ఎవరిది?"



అంటూ చైర్మన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఇప్పటికైనా ఆర్ డ బీ అధికారులు నిద్రలేచి వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టాలని, ప్రమాదాలను నివారించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే ప్రజల తరఫున ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్ బత్తుల లక్ష్మణ్ తదితరులు పాల్గొని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.
ప్రజల ప్రాణాలు ముఖ్యమా... లేక అధికారుల నిర్లక్ష్యమా? ఇప్పటికైనా సంబంధిత శాఖ స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఇల్లందకుంట రథోత్సవానికి కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాక.

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట**
భారీ బైక్ ర్యాలీకి పిలుపు -- కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి ఇల్లందకుంట అపర భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించనున్న ఘనమైన రథోత్సవం (పెద్ద రథం) సందర్భంగా కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రివర్యులు శ్రీ బండి సంజయ్ కుమార్ గారు శనివారం మధ్యాహ్నం 1 గంటకు ఇల్లందకుంటకు విచ్చేయనున్నారు.ఈ సందర్భంగా ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. రథోత్సవ వేడుకల్లో పాల్గొని భక్తులతో



కలిసి ఈ ఆధ్యాత్మిక వేడుకను మరింత వైభవంగా చేయనున్నట్లు సమాచారం. ఆయన రాకతో ఈ ఉత్సవానికి మరింత ప్రాధాన్యత ఏర్పడింది.కావున కార్యకర్తలు, యువత, హిందూ భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. జమ్మికుంట పట్టణంలోని అయ్యప్ప స్వామి గుడి వద్ద నుండి శనివారం మధ్యాహ్నం 1:00 గంటలకు బైక్ ర్యాలీగా ఘనంగా బయలుదేరి ఇల్లందకుంటకు చేరుకోవాలని కోరారు.ఈ ర్యాలీ భక్తి ఉత్సాహంతో పాటు ఐక్యతను చాటిచెప్పే విధంగా నిర్వహించబడనుంది. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ పాటిస్తూ, ట్రాఫిక్ నిబంలు గౌరవిస్తూ ర్యాలీలో పాల్గొనాలని సూచించారు. భక్తులు కాషాయం జెండాలతో, నినాదాలతో ర్యాలీని ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్లాలని నిర్వాహకులు తెలిపారు.అదేవిధంగా రథోత్సవంలో పాల్గొనే భక్తులందరూ శాంతి భద్రతలను కాపాడుతూ, నిర్వాహకుల సూచనలు పాటించాలని కోరారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో పోలీస్ మరియు వాలంటీర్ బృందాలు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నాయి.ఈ పవిత్ర వేడుకలో భాగస్వాములు అవుతూ స్వామివారి కరుణాకటాక్షాలు పొందాలని, ఇల్లందకుంట రథోత్సవాన్ని మరింత ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.